క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు మక్కేవారిపేట, గోలివారితోట, బాపనయ్య నగర్, ఈఎస్ఆర్ గార్డెన్స్ పుట్ట రోడ్డు, ఉడా కాలనీ, శిబిరం, బాపూజీ నగర్‌లతో పాటు టిడ్కో సముదాయంలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

తాడేపల్లి మండల పరిధిలోని చిర్రావూరు గ్రామంలో ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

ఫిరంగిపురంలో..

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో 2009లో ఏర్పాటు చేసిన 3.15 విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అధికలోడుతో అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్‌శాఖ ఏఈ పుల్లారెడ్డి మంగళవారం తెలిపారు. దాని స్థానంలో 5ఎంఈఏ విద్యుత్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండటంతో బుధవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. దీనివల్ల ఫిరంగిపురం, 113 తాళ్లూరు, శిరంగిపాలెం, తక్కెళ్లపాడు, గరుడాచలపాలెం, వేమవరం గ్రామాలకు విద్యుత్ సరఫరానిలిచిపోతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థినికి అభినందన



తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి, పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 565 మార్కులు సాధించిన విద్యార్థినిని మంగళవారం మండల యూటీఎఫ్ శాఖ కార్యవర్గం అభినందించింది. ఈ సందర్భంగా రాష్ట్ర శాఖ సహాధ్యక్షురాలు కె. నాగ కుసుమకుమారి మాట్లాడుతూ దుగ్గిరాల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని నేలవల్లి మీనాక్షి 565 మార్కులు సాధించిందని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మహమ్మద్ గయాసు దౌలా, మండల శాఖ ప్రధాన కార్యదర్శి బి. చలపతిరావు, ఆర్.వి. ప్రసాద్, సతీష్‌బాబు, ప్రభాకరరావు, కె.కామాక్షి, సుధాకర్, నాగలక్ష్మి, పద్మావతి, నాగరాజు, శోభారాణి, శ్రీనివాసరావు, హేమసుందర్, హుస్సేన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ఫిరంగిపురం: వేములూరిపాడు పంచాయతీ కార్యాలయం ఎదురుగా మంగళవారం మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. వేసవిలో ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కార్యదర్శి ఏకేబాబు తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను చలివేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంచారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, గుడిమెళ్ల శ్రీకూర్మనాథస్వామి ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణ జరిగాయి. మర్రెడ్డి రామకృష్ణారెడ్డి, మృదుల దంపతులతో వివిధ రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. లోక కల్యాణం, విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ ఉభయదేవేరి సమేతుడైన స్వామి ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి మాధవస్వామి బృందం వైభవంగా కల్యాణాన్ని జరిపించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు విజయబాబు, అచ్యుతరామయ్య, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం వైఎస్సార్ సీపీ ధ్యేయం

● ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ● కాజలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి లావణ్య ఎన్నికల ప్రచారం



కాజ ఎన్నికల ప్రచారంలో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య పక్కన ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు

మంగళగిరి: పేద ప్రజల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధి కాజలో మంగళవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్యతో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే ఆర్కేకు, మురుగుడు లావణ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ గడచిన ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని గుర్తుచేశారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక టీడీపీ నాయకులు పొత్తులతో ప్రజలను మాయ చేయాలని చూస్తున్నారని, ప్రజలు వారి మాటలను నమ్మవద్దన్నారు. సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలంటే వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రతి గడపకు చేరుకున్నాయన్నారు. పథకాలపై విమర్శలు చేసిన వారికి ప్రజలే సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రంలో 65 మంది బీసీ సామాజిక వర్గం వారికి సీట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ నాయకులు అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి, అర్ల రామయ్య, వెంకట్రావు, రామిరెడ్డి, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ద్వారకానగర్‌లో ఎన్నికల ప్రచారం

మంగళగిరి: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మురుగుడు లావణ్య బుధవారం నగరంలోని ద్వారకానగర్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధి చినకాకాని హాయ్‌ల్యాండ్ రోడ్డు వద్ద నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు.

కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



కౌంటింగ్ హాల్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్, ఆర్వో రాజకుమారి

మంగళగిరి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మంగళగిరి నియోజకవర్గ కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం ఎన్నికల పరిశీలకులు నీరజ్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజకుమారి పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్ వద్ద చేపట్టనున్న ఏర్పాట్ల గురించి అధికారులతో చర్చించారు. పోలింగ్ ముగించుకుని వచ్చే వాహనాలకు విశ్వవిద్యాలయ పరిధిలో ఎటువంటి ట్రాఫిక్ సమస్య కలుగకుండా ప్రణాళికాబద్ధంగా చేపట్టిన ఏర్పాట్ల గురించి ఎన్నికల పరిశీలకులకు వివరించారు. అనంతరం రిటర్నింగ్ అధికారి రాజకుమారి తన కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్, స్టాటిక్ సర్వైలయన్స్ టీమ్స్ లైవ్ స్ట్రీమింగ్‌లు పరిశీలించారు.

శ్రామిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం



కర పత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

తాడేపల్లిరూరల్ : శ్రామిక దినోత్సవం మే 1న ఘనంగా జరుపుకోవాలని మంగళగిరి ఏరియా ఆటో డ్రైవర్స్ ఓనర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట యూనియన్ ఆఫీస్‌లో ప్రగతిశీల కార్మిక సమాఖ్య తీసుకు వచ్చిన మేడే కరపత్రాన్ని నాయకులు, డ్రైవర్స్ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రధాన కార్యదర్శి బి. కొండారెడ్డి మాట్లాడుతూ 138 ఏళ్ల క్రితం శ్రమ దోపిడీపై శ్రామికవర్గం తిరుగబాటుతో మే డేకు అంకురార్పణ జరిగిందని తెలిపారు. 1886లో చికాగో నగరంలో హే మార్కెట్ వద్ద లక్షలాది మంది కార్మికులు 8 గంటల పని విధానం కోసం ఆందోళన మొదలు పెట్టారని, మే 3న 3 లక్షల మంది కార్మికులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేసిన క్రమంలో పోలీసులు కాల్పులు జరిపారని, ఈ కాల్పులలో వందలాది మంది కార్మికులు తమ ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కార్మిక వర్గ పోరును రక్తాక్షరాలతో లిఖించిన రోజుకు గుర్తుగా మే 1న మేడే పోరాట దినంగా జరుపుకుంటున్నామని వివరించారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎస్కే శ్రీను, యూనియన్ నాయకులు ఎస్కే. జాన్ సైదా, ఎస్కే. ఖాసిం, ఎస్కే. సైదా, జి. నివాసరావు, బి.వరప్రసాద్, బి.కృష్ణ, ఏడుకొండలు, రామకృష్ణ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజి వార్డు

● మే నుంచి నిరంతర సర్జికల్ గ్యాస్ట్రో సేవలు
● సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్



వైద్య అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పది పడకల సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డును కేటాయించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలోని పలు విభాగాధిపతులతో సూపరింటెండెంట్ చాంబర్‌లో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వార్డు, ఆపరేషన్ థియేటర్, సిబ్బంది కేటాయింపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ పాదిల ప్రసాద్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో పది పడకల సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజి వార్డును తాత్కాలికంగా కేటాయిస్తున్నట్లు చెప్పారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి ఒక వైద్యుడుతో పాటు, సహాయకులను కూడా నియమిస్తున్నామని చెప్పారు. మే నుంచి నిరంతరంగా సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోటి వెంకటేశ్వర్లు, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆషా సజని పాల్గొన్నారు.

షిరిడిలో మెరిసిన తెలుగు తేజాలు

సాయి నృత్యుత్సవ్– 2024లో ప్రతిభ చూపిన నృత్య కారిణులు



షిర్డీలోని వేదికపై బృందంతో నాట్య గురువు అనుశేఖర్, తల్లిదండ్రులు

గుంటూరు ఎడ్యుకేషన్: షిరిడిలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య ప్రదర్శనల్లో తెలుగుతేజాలు మెరిశారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన నృత్యకారిణులతో పోటీపడి, గుంటూరు కళా ప్రతిభ చాటారు. ఈనెల 27, 28వ తేదీల్లో షిరిడిలో సాయి నృత్యోత్సవ్–2024 పోటీలను నిర్వహించింది. శ్రీసాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ అధికారికంగా జాతీయస్థాయిలో నిర్వహించిన నృత్య పోటీలకు షిరిడిలోని సాయి శతాబ్ది మండపం వేదికగా నిలిచింది. పోటీల్లో పాల్గొన్న గుంటూరు శ్రీనగర్ ఏడోలైనుకు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్య కారిణుల బృందం అక్కడ అద్భుతమైన నృత్య ప్రదర్శనలు ఇచ్చింది. నాట్య గురువు అనుశేఖర్ పర్యవేక్షణలో 12 మంది నృత్యకారిణులు అత్యంత క్లిష్టమైన ''కళింగనర్తన'' (కాళీయమర్ధన) ప్రదర్శనతో షిరిడిలోని తెలుగు వారితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు, విదేశీ పర్యాటకులను ఆకర్షించారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన నృత్య కారిణులు బృందం వారి నాట్య గురువు అనుశేఖర్ సారథ్యంలో ఇప్పటికే రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీకాళహస్తి, కాణిపాకం, విజయవాడతో పాటు గుంటూరు జిల్లాలోని పెదకాకాని, తదితర దేవాలయాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు అవగాహన



సమావేశంలో డాక్టర్ షమ సుల్తానా, షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రిన్సిపల్ రత్తయ్య

గుంటూరు మెడికల్: షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో వరంగల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్ కార్యాచరణపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్, సీనియర్ గైనకాలజిస్ట్, యువ నారి హెల్త్ కేర్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు ఎటువంటి కోర్సులు ఎంచుకుంటే భవిష్యత్‌లో ఎటువంటి ఉపాధి అవకాశాలు లభిస్తాయో అనే అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ షమ సుల్తానా మాట్లాడుతూ భావి భారత భవిష్యత్ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు నేటి విద్యార్థులే అన్నారు. విద్యార్థులు వారు ఎంచుకునే కోర్సులు పైనే వారి భవిష్యత్ ఉంటుందన్నారు. ఏ కోర్సు చేస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయో తదితర విషయాల గురించి ఈనెల 15వ తేదీ నుంచి హోప్ విన్ హాస్పిటల్స్, యువ నారి హెల్త్ కేర్ ఆధ్వర్యంలో యూట్యూబ్, ఫేస్ బుక్, ఇన్ స్టాగామ్ అప్లోడ్ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్ స్టిట్యూషన్స్ యాజమాన్యం డాక్టర్ షమ సుల్తానాను శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం

నగరంపాలెం: ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఒక్కరూ పోలీస్ శాఖ నుంచి ఏదైనా అవసరమైతే నేరుగా సంప్రదించవచ్చునని జిల్లా ఏఎస్పీ(పరిపాలన) జీవీ రమణ మూర్తి అన్నారు. మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్ఐలు వెంకటేశ్వరరావు, పాప రాణి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు వి.విజయ్‌కుమార్, జె.సాంబశివరావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్వీ సత్యనారాయణ, మినిస్ట్రీరియల్ సిబ్బంది సీహెచ్ ఉమాదేవిలను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలు అందించారు. వారు అందించిన సేవలను జిల్లా ఏఎస్పీ కొనియాడారు. డీపీఓ ఏఓ వెంకటేశ్వరావు, ఆర్ఐలు శ్రీనివాసరావు, శ్రీహరిరెడ్డి, గుంటూరు అసోసియేషన్ సభ్యులు హాసన్, లక్ష్మణ్, సాంబశివరావు, ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో ఉద్యోగులు పాల్గొంటే చర్యలు

నెహ్రూ నగర్: ప్రభుత్వ ఉద్యోగులు, అప్కాస్ ఉద్యోగులు ఎవరైనా రాజకీయ పార్టీల ప్రచారాల్లో పాల్గొన్నా, ప్రచారం చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్ఓ) కీర్తి చేకూరి స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన నగరపాలక సంస్థ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆళ్ల అమరేశ్వరరావుని విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు ఏ విధమైన రాజకీయ పార్టీల సభల్లోను, ప్రచార కార్యక్రమాల్లోనూ పాల్గొనకూడదన్నారు. ఇటీవల ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏటుకూరులో టీడీపీ ఏర్పాటు చేసిన రాజకీయ కార్యక్రమంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా రాజకీయ నాయకులకు బొకేలు ఇచ్చి, ఫొటోలు దిగిన నగరపాలక సంస్థ 192వ వార్డ్ సచివాలయం ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆళ్ళ అమరేశ్వరరావుని విధుల నుంచి తొలగించామని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన చేసే వారిని ఉపేక్షించబోమని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రజారోగ్యమే.. ప్రభుత్వ మహా భాగ్యం

● నుస్తి చేసిన వైద్య రంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ వైద్యం
● నూతన భవనాలు, ఆధునిక వసతులతో జీవం
● ఫిరంగిపురంలోని 14 గ్రామాల్లో విలేజ్ హెల్త్‌క్లినిక్‌లకు నూతన భవనాలు
● గ్రామీణ పేదలకు అత్యాధునిక వైద్య సేవలు



నుదురుపాడు పీహెచ్‌సీ నూతన భవనం



ఫిరంగిపురం-1 లోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్



తక్కెళ్లపాడులో నిర్మించిన హెల్త్‌వెల్‌నెస్ సెంటర్



హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌లో సేవలందిస్తున్న సిబ్బంది

ఇది కదా.. అభివృద్ధి

ఫిరంగిపురం: గత పాలకుల విధానాలతో నుస్తి చేసిన ప్రభుత్వ వైద్య రంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 'నాడు – నేడు' ద్వారా అత్యాధునిక వైద్య మందించి జీవం పోసింది. వైద్యుల కొరత, వైద్య పరికరాలు, భవనాల లోటుతో వైద్య సేవలు అంతంత మాత్రంగా కునారిల్లుతున్న సమయంలో సీఎం వైఎస్ జగన్ ఊపిరిలూదారు. గతం.. వైద్యం కోసం గంటల తరబడి ప్రయాణించి, వైద్య సేవలు పొందాల్సి వచ్చేది. ప్రస్తుతం.. ప్రతి పల్లెలో అన్ని రకాల పరీక్షలతో పాటు మెరుగైన వైద్య సేవలు అందేలా విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు వచ్చాయి. ప్రతి రోజు అందుబాటులో ఆరోగ్య సిబ్బంది ఉండి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. నెలకు సరిపడా మందులు అందజేస్తున్నారు.

14 గ్రామాల్లో నూతన భవనాలు

మండలంలో 17 గ్రామాలు ఉండగా 70 వేల పైచిలుకు జనాభా ఉన్నారు. కాగా 14 గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు వీలుగా పీహెచ్‌సీ భవనాలు, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి వాటి కోసం నూతన భవన నిర్మాణాలు చేపట్టింది. నుదురుపాడులో పూర్తిగా శిథిలావస్థకు చేరగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ.1.25కోట్ల నిధులు కేటాయించి, అన్ని వసతులతో కూడిన భవన నిర్మాణం పూర్తిచేసింది. త్వరలో వినియోగంలోకి రానుంది.

విలేజ్ హెల్త్ వెల్ నెస్ భవనాలు ఇలా..

ఫిరంగిపురం, 1,2,3తో పాటు అమీనాబాద్, వేములూరిపాడు, 113, తాళ్లూరు, తక్కెళ్లపాడు, యర్రగుంట్లపాడు, బేతపూడి, గుండాలపాడు, మేరికపూడి, పొనుగుపాడు, రేపూడి, వేమవరం గ్రామాల్లో నూతనంగా భవన నిర్మాణాలను ప్రభుత్వం పూర్తిచేసింది. దానికోసం ఒక్కోదానికి రూ.17.50లక్షలు కేటాయించగా మొత్తం భవనాలకు రూ.3.08కోట్ల నిధులు ఖర్చు చేసింది. తొమ్మిది గ్రామాల్లోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు నూతన భవనాల్లో పనిచేస్తుండగా మిగిలిన భవనాలు త్వరలో ఉపయోగంలోకి రానున్నాయి.

వైద్య సేవలు ఇలా..

ప్రతి రోజు 30 నుంచి 50 మంది వరకు ప్రజలకు 14 రకాలు వైద్య పరీక్షలు చేయడమే కాకుండా 105 రకాల మందులు నెలకు సరిపడా ఉచితంగా అందజేస్తున్నారు. ఒక్కో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఒక ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఉండి ప్రజలకు సేవలు అందిస్తున్నారు. హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌నకు వచ్చే గర్భిణులకు, బాలింతలకు షుగర్, బీపీ, థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు చేయడమేకాకుండా వైద్యుల పర్యవేక్షణలో మందులు అందజేస్తారు.

మాదిగల ఆత్మగౌరవం తాకట్టు సిగ్గుచేటు

నెహ్రూ నగర్: మాదిగల ఆత్మగౌరవాన్ని మందకృష్ణ మాదిగ టీడీపీకి తాకట్టు పెట్టడం సిగ్గుచేటని మాదిగ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుసులూరి జీవ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ హయాంలో మాదిగలను అన్ని రకాల ఇబ్బందులకు గురి చేసిన చంద్రబాబుకు ఏ విధంగా మద్దతు ఇస్తున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు కూటమికి ఓట్లు వేస్తే మాదిగలు మరింత వివక్షకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. విజ్ఞత కలిగిన మాదిగలు ఓటుతో టీడీపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వీజే వినయ్ కుమార్, వీరారాజు, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

కార్మికుల పని వేళలు మార్చాలి

లక్ష్మీపురం: జిల్లాలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు అధికంగా ఉన్నందున పలు రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల పనివేళలను రీ షెడ్యూల్ చేయాలని కార్మిక శాఖ సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.శ్రీనివాస్ కుమార్ మంగళవారం తెలిపారు. రోజువారి భవన నిర్మాణ కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల రక్షణకు, ఇటుకల బట్టీలు, దుకాణాలు, సంస్థలు, పరిశ్రమల యజమానులకు పలు మార్గదర్శకాలు, సూచనలు చేశారు. కార్మికులపై ఎండ తీవ్రత ప్రతికూల ప్రభావం పడకుండా చూడాల్సిన బాధ్యత ఆయా యాజమాన్యంపై ఉందని చెప్పారు. కష్టమైన పనులు చేసే కార్మికుల పని వేళలు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మార్పు చేసి పనికి దూరంగా ఉంచాలన్నారు. పని ప్రదేశంలో నీడ ఉండేలాగా, ఎండ తీవ్రత తక్కువగా ఉన్న సమయంలో వారు పనిచేసేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో అవసరాల మేరకు మంచినీటి సౌకర్యం కల్పించాలని, భవన నిర్మాణ కార్మికులకు అత్యవసర ఐస్ ప్యాక్స్ అందించాలన్నారు. ఆరోగ్య శాఖ సమన్వయంతో కార్మికులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. కార్మిక శాఖ కమిషనర్ జారీ చేసిన ఈ మార్గదర్శకాలను ప్రతి ఒక్క యజమాని పాటించాలన్నారు. కార్మికులకు ఉపశమనం కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని వెల్లడించారు.